క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పఠనం



ఏలేశ్వరంలో హనుమాన్ చాలీసా పఠనం చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: ఆంజనేయస్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా శనివారం పట్టణంలోని హనుమాన్‌చాలీసా పఠనం చేశారు. స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్‌చాలీషా పఠించారు. పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల సభ్యులు రామాయణ కథాకాలక్షేపం, రామగీతాలు ఆలపించారు. పలు పారాయణలు చేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి నడిశెట్టి తిరుపతిరావు, మండల కార్యదర్శి కటకం కిరిటీ, సంఘ సభ్యులు పాబోలు దేవి, కల్యాణి, పాబోలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి శివశ్రీకి అభినందనలు



కిర్లంపూడి: ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారిణి శివశ్రీని కిర్లంపూడిలో శనివారం పలువురు అభినందించారు. క్రీడాకారిణి శ్రీవశ్రీ 2020లో కాకినాడ జేఎన్‌టీయూకే ఇండోర్ స్టేడియంలో జరిగిన ఆలిండియా సివిల్ సర్వీస్ చెస్ టోర్నిలో ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అదే ఏడాది విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 11 నుంచి 19 వరకూ ఒడిశాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పోటీల్లో ప్రతిభ చూపి రన్నరప్‌గా నిలిచింది. కాగా శివశ్రీని గ్రామానికి చెందిన యల్లపు రామ్‌ప్రసాద్, నరాల గోవిందు, పలువురు స్థానికులు అభినందించారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకార సేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాకారంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, వందలాది మంది భక్తుల నడుమ ఆలయప్రాకారంలో మూడు సార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ప్రధానాలయానికి చేర్చారు. వేద పండితులు యనమండ్ర శర్మ, చిట్టి శివ ఘనపాఠి, రమేష్ ఘనపాఠి, అర్చకుడు యడవిల్లి వేంకటేశ్వరరావు, ఏఈఓ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

'మీ భవిష్యత్-నా బాధ్యత' ప్రారంభం

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ శనివారం 'మీ భవిష్యత్-నా బాధ్యత' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గాను నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ పర్యటిస్తానన్నారు. ఏడాది కాలం పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌దే భవిత

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): భవిష్యత్‌లో అన్ని సెక్టార్లలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కీలకం కాబోతోందని ఐటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొవ్వూరి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కాకినాడ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ అంశంపై సదస్సు నిర్వహించారు. ఐటీ సంస్థలన్నీ ఏకతాటిపై ఉండి కొత్త సాంకేతికతపై అవగాహనతో పాటు ఎనలిటిక్స్‌లో కొత్త పరిణామాలు, తాజా పోకడలపై ఎంఎన్‌సీ సంస్థలు టెక్ మహీంద్ర, క్యాప్ జెమినీ వంటివి విశ్లేషించాయి. రాష్ట్రంలో వైజాగ్ ఐటీ చాప్టర్ తరువాత ప్రధాన పాత్ర పోషించే దిశగా కాకినాడ చాప్టర్ అభివృద్ధి చెందుతోందని, ప్రస్తుతం 40 సంస్థలు ఈ చాప్టర్‌లో ఉన్నాయన్నారు. వైజాగ్ సమ్మిట్ తరువాత ఐటీ కంపెనీలు మరింత చురుగ్గా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని కృష్ణారెడ్డి తెలిపారు. ఐటీఏపీపీ అధ్యక్షుడు శ్రీధర్ కొనరాజు ఐటీ నిపుణులు జె.కుమార్, లక్ష్మి, ఆర్ఎల్ నారాయణలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 140 మంది ఐటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరకు సాగు.. కనుమరుగు

- మెట్టలోనూ చేతులెత్తేసిన అన్నదాతలు
- మూతపడిన తాండవ సుగర్ ఫ్యాక్టరీ
- మంత్రి దాడిశెట్టి రాజా కృషితో రైతులకు బకాయిల చెల్లింపు



కాకరాపల్లిలో సాగు చేసిన చెరకు (ఫైల్)

కోటనందూరు: తాండవ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని గ్రామాల్లో ఒకప్పుడు ఎక్కడ చూసినా చెరకు పంటే దర్శనమిచ్చేది. సీజన్ వచ్చిందంటే చెరకు బళ్లతో మెట్ట ప్రాంతం కళకళలాడేది. అలాంటి చెరకు సాగు ప్రస్తుతం కనుమరుగైంది. దేవుడికి చెరకు ముక్క పెట్టాలన్నా దొరికే పరిస్థితి లేదు. ఈ దుస్థితికి గత పాలకుల స్వార్థపూరిత విధానాలే కారణం. రైతు ప్రయోజనాలను పూర్తిగా మరిచి తాండవ సుగర్ ఫ్యాక్టరీని నిలువ దోపిడీ చేశారు. ఫలితంగా ఫ్యాక్టరీ నష్టాలతో మూతపడింది. దీంతో రైతులు చెరకు సాగుకు గుడ్‌బై చెప్పారు.

13 వేల మంది షేర్ హోల్డర్లు

ఐదు దశాబ్దాల క్రితం తుని, పాయకరావుపేట సరిహద్దు ప్రాంతంలో తాండవ సుగర్ ఫ్యాక్టరీని నిర్మించారు. ఈ ఫ్యాక్టరీ తుని, ప్రత్తిపాడు, విశాఖ జిల్లా పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. ఈ కర్మాగారంలో 13 వేల మంది షేర్ హోల్డర్లు ఉండగా 650 మంది కార్మికులు పని చేసేవారు. ఫ్యాక్టరీ నెలకొల్పిన తొలినాళ్లలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వరకూ క్రషింగ్ జరిగేది. కాల క్రమంలో క్రషింగ్ సామర్థ్యం వేల టన్నులకు దిగజారింది. ఆ తరువాత పరిస్థితి మరింత క్షీణించి చివరకు క్రషింగ్ చేయలేని దయనీయ పరిస్థితికి చేరింది.

గత పాలకుల నిర్లక్ష్యం

రెండు దశాబ్దాలుగా తాండవ చక్కర కర్మాగారం నిర్వహణ రాజకీయ నేతల చేతుల్లోకి వెళ్లడంతో ఏళ్ల తరబడి దేదీప్యమానంగా నడిచే కర్మాగారం క్రమంగా మసకబారుతూ వచ్చింది. దశాబ్దం క్రితం దివాళా తీసే స్థాయికి చేరింది. గత పాలకులు కర్మాగారంలో కనీసం మరమ్మత్తులు కూడా చేయకుండా క్రషింగ్‌ను ఇబ్బందికరంగా మార్చారు. ఫ్యాక్టరీ నిర్వహణను గాలికొదిలి దొరికినంత దోచుకున్నారు. చివరకు ఫ్యాక్టరీని దివాళా తీసే స్థితికి దిగజార్చారు.

11 కోట్ల బకాయిలు చెల్లింపు

గతంలో ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులకు రూ.11 కోట్ల వరకూ బకాయిలు ఉండేవి. ఫ్యాక్టరీలో పని చేస్తున్న 650 మంది కార్మికులకు జీతాల రూపంలో మరో రూ.10 కోట్ల బకాయి వెరసి రూ.21 కోట్ల ఆర్థిక భారం ఫ్యాక్టరీపై ఉండేది. రైతుల విజ్ఞప్తి మేరకు మంత్రి దాడిశెట్టి రాజా కృషితో ఏడాది క్రితం రైతుల బకాయిలను పూర్తిగా చెల్లించారు. కార్మికుల జీతాలను సైతం కొంతమేర చెల్లించి ఊరట కల్పించారు. ఫ్యాక్టరీని అందుబాటులోకి తీసుకురావాలంటే రూ.50 కోట్లు వరకూ అవసరం ఉంది. ఫ్యాక్టరీని తిరిగి తెరిచేందుకు, చెరకు సాగును ప్రోత్సహించేందుకు మంత్ర దాడిశెట్టి రాజా కృషి చేస్తున్నారు.

బకాయిలు చెల్లించారు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు బకాయిలు పూర్తిగా చెల్లించారు. గతంలో ఫ్యాక్టరీ ఒక పద్ధతి ప్రకారం నడవకపోవడంతో మూతపడే దుస్థితి ఏర్పడింది. వరిసాగుతో రైతులకు పెద్దగా ప్రయోజనం ఉండదు. ఈ తరుణంలో అన్నివిధాలా లాభదాయకంగా ఉండే చెరకు సాగును ప్రోత్సహించాలి. ఫ్యాక్టరీని తిరిగి తెరిపించేందుకు కృషి చేయాలి.

– రామసూర్యసత్యనారాయణ, చెరకు రైతు, బొద్దవరం

వేంకటేశ్వరస్వామికి ఎమ్మెల్యే పూజలు



వాల్మీక వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: గుమ్మళ్లదొడ్డిలో పుట్టలో వెంకన్నగా ప్రసిద్ధి గాంచిన మహాలక్ష్మీ సమేత వాల్మీక వేంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గత మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే చంటిబాబు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనలో ఎమ్మెల్యే పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, సచివాలయాల మండల కన్వీనర్ దాసరి రమేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ పట్టాలు పొందిన విద్యార్థులు

గండేపల్లి: విద్యార్థులు బాగా చదువుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కాకినాడ ఐఐఎఫ్‌టీ హెడ్ వి.రవీంద్ర సారథి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న రోజులు, గడిచిన స్నేహబంధాలు జీవితంలో మధుర జ్ఞాపకాలుగా మిలిగిపోతాయన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. బిజినెస్ స్కూల్ డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన ప్రతిఒక్కరూ కార్పొరేట్ కంపెనీల్లో కొలువులు సాధించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. బీబీఏ, ఎంబీఏ, ఐఎంబీఏ, పీజీడీఎం విభాగాల్లో చదువు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.విజయ భార్గవి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఎం.గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు తొమ్మిది మంది గైర్హాజరు

ప్రత్తిపాడు: మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో శనివారం జరిగిన పదో తరగతి ఇంగ్లిషు పరీక్షకు తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో 189 మందికి 188 మంది, ధర్మవరం జెడ్పీ హైస్కూల్‌లో 167 మందికి 163 మంది, లంపకలోవ జెడ్పీ హైస్కూల్‌లో 254 మందికి 251 మంది హాజరు కాగా ఒమ్మంగి జెడ్పీ హైస్కూల్ ఎ సెంటర్‌లో 180 మంది, ఒమ్మంగి బి సెంటర్‌లో 149 మంది వెరసి 939 మందికి 930 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను స్థానిక సీఐ కె.కిషోర్‌బాబు పరిశీలించారు.

పదో తరగతి పరీక్షలకు ఐదుగురు గైర్హాజరు

గండేపల్లి: మండల వ్యాప్తంగా శనివారం జరిగిన పదో తరగతి పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ తెలిపారు. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 483 మందికి గాను 478 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించారు.

రహదారుల అభివృద్ధికి పెద్దపీట

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా



తుని రామకృష్ణాకాలనీలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రాజా, చైర్ పర్సన్ సుధారాణి

తుని: రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని పట్టణం రామకృష్ణా కాలనీలో డెక్కన్ కెమికల్ ఫ్యాక్టరీ సహకారంతో నూతనంగా నిర్మించిన మెయిన్ రోడ్డును శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి మంత్రి రాజా ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన రవాణా సదపాయాలు కల్పించాలని ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమానికి కార్పొరేట్ కంపెనీలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నాయన్నారు. దీనిలో భాగంగా డెక్కన్ కెమికల్ ఫ్యాక్టరీ యాజమాన్యం రామకృష్ణాకాలనీ మెయిన్ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు నిధులు సమకూర్చిందన్నారు. ఈ నిధులతో 350 మీటర్లు పొడువు, 7.50 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మించడం అభినందనీయమన్నారు. తుని మండలం తాళ్లూరులో నిలిచిపోయిన ఉర్దూ పాఠశాల భవనాన్ని పూర్తి చేసేందుకు సహకరించాలని మంత్రి రాజా కంపెనీ ప్రతినిధులను కోరారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, వార్డు కౌన్సిలర్ కాసే సుమతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



ప్రత్తిపాడులో నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న విశ్రాంత వైద్యాధికారి రమణ

ప్రత్తిపాడు: సమాజ సేవకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఏలేశ్వరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) విశ్రాంత వైద్యాధికారి ఏవీ రమణ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం ఆవరణలో శనివారం నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. 'సదా మీ సేవలో' స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన కిట్లను విశ్రాంత వైద్యాధికారి ఏవీ రమణ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు ఎస్ఎంఎస్ వంటి సంస్థలు అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని కొనియాడారు. క్రమం తప్పకుండా ప్రతీ నెలా పేద విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీషిర్డీసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి, మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యానందం, శిరసాల మణికంఠజ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మాల చైతన్య సదస్సు

అన్నవరం: రాజ్యాధికారం కోసం ఐక్యంగా పోరాడాలని పలువురు ఎస్సీ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక గౌరీ కల్యాణ మండపంలో శనివారం రాష్ట స్థాయి మాల చైతన్య సదస్సు నిర్వహించారు. హక్కుల సాధన కోసం పోరాటానికి సిద్ధం కావాలని సంఘ నాయకులు కోరారు. సమావేశంలో మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, నాయకులు కేబీఆర్ అంబేడ్కర్, ఎస్ఏడీ పాల్, బి.సుదర్శన్, నూతలపాటి సోనీవుడ్, దాసరి చెన్న కేశవులు, అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్‌ఫర్ జీసస్



జగ్గంపేటలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



గోకవరంలో ర్యాలీ చేస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

జగ్గంపేట: ఈస్టర్ పండగను పురస్కరించుకుని జగ్గంపేటలో యునైటెడ్ పాస్టర్స్ ఆఫ్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం రన్‌ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. పాస్టర్స్ ఫెలోషిప్ మండలాధ్యక్షుడు జాన్ వెస్లీ ఆధ్వర్యంలో క్రైస్తవులు ర్యాలీ చేశారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ విజయరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ ర్యాలీ

గోకవరం: మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం ఈస్టర్ ర్యాలీ నిర్వహించారు. కృష్ణుడిపాలెంలోని ఈహెచ్‌హెచ్ చర్చి వద్ద ర్యాలీని ప్రారంభించారు. గోకవరంలోని ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ చేశారు. మండలంలోని 70 మంది పాస్టర్లు, 600 మంది క్రైస్తవులు ర్యాలీలో పాల్గొన్నారు.

గ్రామాల్లో రన్ ఫర్ జీసస్

ప్రత్తిపాడు: మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. మండల పాస్టర్ల సంఘ కో ఆర్డినేటర్ షాలేము రాజు ఆధ్వర్యంలో స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద ర్యాలీని ప్రారంభించారు. మెయిన్‌రోడ్డు, మార్కెట్, అల్లూరి సీతారామరాజు జంక్షన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్, గోకవరం వీధి, మునసబు గారి వీధి, ఎంప్లాయీస్ కాలనీ, ఇందిరా కాలనీ మీదుగా ర్యాలీ సాగింది. పాస్టర్లు జె.జాన్‌శామ్యూల్, జి. సుందరరావు, మూరా శామ్యూల్, జి.ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి, 19 మద్యం సీసాలతో ఇద్దరిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ శనివారం తెలిపారు. ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్ ఆదేశాలపై మద్యం బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. శంఖవరంలో బెల్ట్ షాపు నిర్వాహకుడు అల్లు అనిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని, అతని నుంచి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో అల్లా సూరిబాబును ఆదుపులోకి తీసుకుని, అతని నుంచి 11 మద్యం, బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

పేదల అభ్యున్నతి జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గ్రామాల్లో ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్'



గుమ్మళ్లదొడ్డిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి సీఎం జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో శనివారం ఆయన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి మద్దత్తు తెలిపిన వారి ఇంటి గోడలకు వారి అనుమతితో సీఎం వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను అతికించారు. అలాగే గ్రామంలో ప్రభుత్వం పనితీరుపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, సచివాలయాల మండల కన్వీనర్ దాసరి రమేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సీనియర్ నాయకులు కర్రి సూరారెడ్డి, సమ్మిటి మోహన్, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాల్లో శనివారం జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, పార్టీ గృహసారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించారు. స్థానిక 13 వార్డులో వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య, పార్టీ పట్టణ కన్వీనర్ అలమండ వీరరాఘవస్వామి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. గత మూడున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. పార్టీ నాయకులు చల్లా రాము, గూనాపు అప్పలరాజు, చల్లా ప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

చిల్లంగిలో జగనన్నే మా భవిష్యత్

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగిలో శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ తోట రవి, మండల సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్, వైస్ ఎంపీపీ బొద్దేటి గణపతి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దోమాల గాంగాధర్ తదితరులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి గోడలపై స్టిక్కర్లు అతికించారు. వైఎస్సార్ సీపీ నాయకులు తోట రవి, పెంటకోట నాగబాబు పాల్గొన్నారు.

తుని: పట్టణ పరిధిలోని వార్డుల్లో శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జోరుగా సాగింది. వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణా గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు.

ప్రజల నమ్మకాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు అన్నారు. మండలంలోని ఒమ్మంగి, రాచపల్లి, ధర్మవరం, ఉత్తరకంచి, పెద్దిపాలెం గ్రామాల్లో శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు.

ప్రత్తిపాడు: గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం 'జగనన్నే మా భవిష్యత్తు'కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు ఆకుల వీరబాబు, మేడిబోయిన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లిలో ఎంపీపీ లగుడు శ్రీనివాస్, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, వైస్ ఎంపీపీ బంటుపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు.

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఈగల విజయదుర్గ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో వైఎస్సార్ సీపీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు సాపిశెట్టి భూలక్ష్మి ఆధ్వర్యంలో జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు.



ప్రత్తిపాడులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్



ఏలేశ్వరంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చిల్లంగిలో లబ్ధిదారుడికి పథకాలు వివరిస్తున్న వైస్సార్ సీపీ నాయకులు

వైభవంగా సత్యదేవుని నిత్య కల్యాణం



రత్నగిరిపై సత్యదేవుని నిత్యకల్యాణం జరిపిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని నిత్యకల్యాణం శనివారం ఘనంగా జరిగింది. ఆలయ పండితులు చామర్తి కన్నబాబు, అంగర సతీష్ శర్మ, దత్తాత్రేయశర్మ తదితరులు ఉదయం తొమ్మిది గంటల నుంచి 11.30 గంటల వరకు స్వామివారి కల్యాణం జరిపించారు. స్వామివారి కల్యాణంలో ప్రతిఘట్టాన్ని కల్యాణబ్రహ్మ కన్నబాబు భక్తులకు వివరించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు 20 జతల పట్టువస్త్రాలను సమర్పించారు. 40 మంది భక్తులు రూ.1,116 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు.

ఏటా రూ.50 లక్షలకు పైగా ఆదాయం

ఏటా ఐదు వేలకు పైగా భక్తులు స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొంటున్నారు. దేవస్థానానికి రూ.50 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతోంది. భక్తులు స్వామి, అమ్మవార్లకు కట్న కానుకల రూపంలో, పట్టువస్త్రాల రూపంలో మరో రూ.ఐదు లక్షలు వరకు సమర్పిస్తుంటారు.

భక్తుల అసంతృప్తి

స్వామివారి నిత్య కల్యాణ వేదిక ఆకర్షణీయంగా లేకపోవడంతో భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ కల్యాణవేదిక పై భాగంలో సీలింగ్ చేయడానికి ఏర్పాట్లు చేసి వదిలి వేశారు.